# వరిసాగులో రైతులు బిజీ


ఊటపల్లి శివారులో సిద్ధంగా ఉన్న నారు

- అందుబాటులో సాగునీరు
- 24 గంటల విద్యుత్ సౌకర్యం
- పెట్టుబడిసాయం అందిస్తున్న కేసీఆర్ సర్కారు

బోధన్ రూరల్, డిసెంబర్1: ఒకప్పుడు నీటి ఎద్దడి, విద్యుత్, ఎరువుల సమస్య దృష్ట్యా యాసంగిలో పంటలు సాగుచేసేందుకు రైతులు వెనకంజ వేసేవారు. కానీ సీఎం కేసీఆర్ సీఎం అయ్యాక నీటి సౌకర్యం, 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించారు. పంట పెట్టుబడిసాయం అందజేస్తున్నారు. దీంతో రైతులు పంటల సాగు జోరందుకున్నది. మహిళా కూలీలతోపాటు నాటు వేసే యంత్రాలు, బీహార్ కూలీలకు డిమాండ్ ఏర్పడింది. ఒకప్పుడు చేద్దామంటే పని దొరికేది కాదు.

**మండలంలో పెరగనున్న సాగు విస్తీర్ణం**

బోధన్ మండలంలో యాసంగిలో 18 వేల నుంచి 20 వేల ఎకరాల్లో వరి పంట సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వానకాలంలో 25 వేల ఎకరాల్లో సాగు చేశారు. యాసంగిలో సాగు విస్తీర్ణం స్వల్పంగా తగ్గనున్నట్లు చెబుతున్నారు. గ్రామాల్లో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. రైతులు కూలీకి రూ.400 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నారు. అక్కడక్కగ ఎకరానికి గుత్తగా రూ.4 వేలు చొప్పున ఇస్తున్నారు.

**అందుబాటులో బీహార్ కూలీలు**

నాట్లు వేసేందుకు మహిళలు కొరత తీవ్రంగా ఉండడంతో కొంత మంది మధ్యవర్తులు బీహార్ కూలీలను వలస తీసుకువస్తున్నారు. నాట్లు వేసే వారికి ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇస్తున్నారు. పది నుంచి పదిహేను మంది చొప్పున ఉన్న కూలీల బృందం రోజుకు మూడు నుంచి ఐదెకరాల్లో నాటు వేస్తారు. నాట్లు వేసేందుకు యంత్రాలు సైతం అందుబాటులో ఉన్నాయి.

# బోధన్ నియోజకవర్గంలో 77.81 శాతం పోలింగ్

బోధన్, డిసెంబర్ 1: బోధన్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 77.81 శాతం పోలింగ్ నమోదైంది. 2,20,068 మంది ఓటర్లు ఉండగా, 1,71,247 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 1,05,573 మంది పురుష ఓటర్లు ఉండగా, వారిలో 81,153 మంది ఓటేశారు. కాగా, నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,14,490 మంది ఉండగా, వారిలో 90,092 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం విషయంలో ఎన్నికల అధికారులు పోలింగ్ పూర్తయిన తర్వాత గురువారం సాయంత్రం పోలింగ్ శాతాన్ని 68.05 శాతంగా మొదట ప్రకటించారు. శుక్రవారం రెండుసార్లు సవరణలు చేశారు. చివరిగా, శుక్రవారం సాయంత్రం 77.81 శాతంగా పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పురుషుల కంటే మహిళలు పోలింగ్‌లో చురుగ్గా పాల్గొన్నారు. పురుషుల కంటే 8.939 మంది మహిళలు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

**రాంపూర్‌లో అత్యధిక శాతం నమోదు..**

బోధన్ నియోజకవర్గంలో అధికంగా పోలింగ్ జరిగిన గ్రామాల్లో బోధన్ మండలం రాంపూర్ గ్రామం ప్రథమస్థానంలో నిలిచింది. ఇక్కడ 92.71 శాతం పోలింగ్ నమోదైంది. బోధన్ మండలంలోని తగ్గెల్లి గ్రామం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక్కడ 92.41 శాతం పోలింగ్ నమోదైంది. ఎడపల్లి మండలం కేంద్రంలోని 212 నంబర్ పోలింగ్ స్టేషన్ అధికంగా పోలింగ్ నమోదులో మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడ 92.32 శాతం పోలింగ్ నమోదైంది.

**పట్టణంలో అత్యల్పం..**

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన 65వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో నియోజకవర్గంలోనే అత్యల్పంగా పోలింగ్ నమోదైంది. 715 మంది ఓటర్లు ఉండగా, 377 మంది ఓట్లు వేశారు. పోలింగ్ శాతం 52.73 నమోదైంది. ఇదే కళాశాల భవనంలో ఏర్పాటుచేసిన 66వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో 53.39 శాతం పోలింగ్ నమోదైంది. శక్కర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 93వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో 53.94 శాతం పోలింగ్ జరిగింది.

**స్క్రూటినీ పూర్తి..**

బోధన్ పట్టణంలోని విజయమేరీ హైస్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్‌లో శుక్రవారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు లలిత్ నారాయణ్‌సింగ్ సమక్షంలో బోధన్ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లలో నమోదైన 17ఏ ఫారాలు, పోలింగ్ ఆఫీసర్ డైరీల స్క్రూటినీ నిర్వహించారు. గురువారం నిర్వహించిన పోలింగ్ అనంతరం వివిధ పోలింగ్ స్టేషన్ల నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్లతోపాటు వచ్చిన 17ఏ ఫారాలు, పీవో డైరీలను బోధన్ నియోజకవర్గం అభ్యర్థులు, అభ్యర్థుల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లకు చూపించేందుకు ఈ స్క్రూటినీ నిర్వహించారు. అభ్యర్థుల తరపున హాజరైన వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల సమక్షంలో లలిత్ నారాయణ్‌సింగ్ స్ట్రాంగ్ రూమ్‌లను తెరిపించి, ఆ రూమ్‌ల నుంచి 17ఏ ఫారాలు, పీవో డైరీలను బయటికి తీసుకువచ్చారు. చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడంతో వారి సంతకాలు తీసుకుని స్క్రూటినీని ముగించారు. బోధన్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ తహసీల్దార్ గంగాధర్ ఉన్నారు. స్క్రూటినీకి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లుగా బీఆర్ఎస్ నుంచి బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, కాంగ్రెస్ నుంచి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎండీ గౌసుద్దీన్, బీజేపీ నుంచి భాస్కర్‌రెడ్డి, వివిధ పార్టీల ఏజెంట్లు హాజరయ్యారు.

# ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలని పూజలు


ముప్కాల్‌లో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కొండగట్టులో పూజలు చేస్తున్న రేగుల రాములు

ముప్కాల్ డిసెంబర్ 1: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించాలని కోరుతూ మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక జేపీ కాలనీ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేపీ కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో..**

వేల్పూర్, డిసెంబర్ 1: నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి మూడోసారి భారీ మెజార్టీతో గెలువాలని కోరుతూ ఆర్టీఏ సభ్యుడు రేగుల రాములు శుక్రవారం కొండగట్టు ఆంజనయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రశాంత్‌రెడ్డి మళ్లీ గెలువాలని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని వేడుకున్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్1: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌యూనిట్ అధికారి సాయి కోరారు. పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉంటే దోమ లార్వా వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు.వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పాటించాలని తెలిపారు. ఇండ్ల వద్ద కుండీల్లోని నీటిని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్ శేఖర్, ఆరోగ్య కార్యకర్త ఆనంద్, ఆశ కార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

# 4 నుంచి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు

**క్రీడాకారుల శిక్షణ శిబిరం ప్రారంభం**

మెండోరా, డిసెంబర్ 1: మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో ఈనెల 4 నుంచి మూడు రోజులపాటు 70వ సీనియర్ బాలికల ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ కబడ్డీ గంగాధర్ తెలిపారు. బుస్సాపూర్ గ్రామానికి చెందిన మాజీ కబడ్డీ క్రీడాకారుడు ఏలేటి సాయిరెడ్డి జ్ఞాపకార్థం మెమోరియల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కబడ్డీ క్రీడాకారులను జిల్లా డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోపిడి గంగారెడ్డి, నాయకులు క్రీడాకారులను పరిచయం చేసుకుని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను ఏలేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి సంతోష్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ముత్యంరెడ్డి, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, క్రీడాకారులు ఉన్నారు.


కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీసీసీబీ డైరెక్టర్, క్రీడాకారులతో నాయకులు

# గోదావరి పరిక్రమణ యాత్ర ప్రారంభం

రెంజల్, డిసెంబర్ 1: మండలంలోని కందకుర్తి నది ఒడ్డున గల సీతారాం సంత్ సేవా ఆశ్రమ వ్యవస్థాపకుడు సీతారాం త్యాగి మహరాజ్ శుక్రవారం గోదావరి పరిక్రమణ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర త్రయంబకేశ్వర్ (నాసిక్) గోదావరి పుట్టిన స్థలం వరకు 13 రోజుల పాటు కొనసాగుతుందని భక్తులు తెలిపారు. యాత్రలో అయోధ్య మఠాధిపతులు, 300లకు పైగా స్వాములు, భక్తులు, వాహనాల్లో బయల్దేరారు. సీతారాం త్యాగి మహరాజ్, కొందరు భక్తులు మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి రైలులో బయల్దేరారు.


ధర్మాబాద్‌లో రైల్వే స్టేషన్‌లో సీతారాం సంత్ త్యాగి మహరాజ్, భక్తులు


పోలీసు కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ కులస్తులు

## పోలీసు కిష్టయ్యకు నివాళి

ఎడపల్లి, డిసెంబర్ 1: మండల కేంద్రంలో ని సాటాపూర్‌గేట్‌లో పోలీసు కిష్టయ్య వర్ధంతిని ముదిరాజ్ కులస్తులు శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. పోలీసు కిష్టయ్య తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన మహోన్నత వ్యక్తిఅని కొనియాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనతోపాటు తెలంగాణ ప్రజల హక్కుల కోసం ప్రాణాలను అర్పించారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాప్రసాద్, రాజ్ కుమార్, ఆంజనేయులు, ఒడ్డన్న, మల్లేశ్, నెల్లి రాజు, అబ్బులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.